# చదువే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది

- విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో ఉండాలి
- నర్సింగ్ కళాశాల భవనాన్ని పరిశీలించిన మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 13 : నేటి పోటీ ప్రపంచంలో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఉన్నదని, చదువే విద్యార్థి భవిష్యత్‌కు పునాదిరాయి వంటిదని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. దేశాయిపేట్ గ్రామంలో రూ.40 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. భవనం మొదటి రెండంతస్తుల్లో తిరుగుతూ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా సాగుతుండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ సహకారంతో నర్సింగ్ కళాశాలను మంజూరు చేసుకోవడంతో పాటు కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానని చెప్పారు. నర్సింగ్ విద్యకు మంచి డిమాండ్ ఉందని అన్నారు. విద్యార్థులు కష్టపడి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. నాణ్యమైన విద్యను అందించడంతోపాటు విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ కళాశాల భవనంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించామని అన్నారు. నర్సింగ్ పూర్తి చేసుకున్న వెంటనే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థినుల కోసం పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లను నిర్మిస్తున్నామని, ఇందులో 600 మంది విద్యార్థినులు, నర్సింగ్ విద్యార్థినులు 400 మంది మొత్తం 1,000 మంది విద్యార్థినులకు ఇక్కడే వసతి సౌకర్యాలు కల్పించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు డాక్టర్లతో సమానమని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె, బస్తీ దవాఖానల్లో ఎంబీబీఎస్ డాక్టర్ల తర్వాత నర్సింగ్ చదివిన వారినే డాక్టర్లు నియామకం చేపట్టామని తెలిపారు. అనంతరం ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తి హోదా సాధించడంపై కళాశాల బృందానికి అభినందించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మొదట సారిగా కళాశాలకు వచ్చిన పోచారానికి కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందం, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట ఆర్డీవో భుజంగ్‌రావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ భూలక్ష్మి, ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, పీపీ భగవాన్‌రెడ్డి, బాన్సువాడ సొసైటీ చైర్మన్ ఎర్వాల కృష్ణారెడ్డి, దేశాయిపేట్ ఎంపీటీసీ వెంకటరమణ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌నాయక్, రాజేశ్వర్‌గౌడ్, నాయకులు మహ్మద్ ఎజాస్, శ్రావణ్‌కుమార్, మల్లేశ్, లింగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

## మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారానికి ఘనంగా సన్మానం



ఎమ్మెల్యే పోచారాన్ని సన్మానిస్తున్న బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామస్తులు

బాన్సువాడ, డిసెంబర్ 13 : బాన్సువాడలోని ఎస్ఎంబీ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల కృతజ్ఞత సభ, ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి వేలాదిగా బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా తమ నాయకుడు పోచారాన్ని శాలువాలు కప్పి, పూలమాలలు, గజమాలలతో అభిమానులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు పోచారం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్, బంజార సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బద్యానాయక్, బాన్సువాడ వైస్ ఎంపీపీ హరిసింగ్, జడ్పీటీసీ పద్మాగోపాల్ రెడ్డి, స్వరూపా శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు ఎర్వాల కృష్ణారెడ్డి, గంగుల గంగారాం, ఏఎంసీ చైర్మను నెర్రె నర్సింహులు, వైస్ చైర్మన్ రాజు, హమీద్, మూడ్ కవిత అంబర్‌సింగ్, జడ్పీకోఆప్షన్ సభ్యుడు సిరాజ్, సాయిరెడ్డి, పిట్ల రాము, పత్తి లక్ష్మన్, వర్ని గోపాల్, పిట్ల శ్రీధర్, సంగ్రాంనాయక్, ఆయా మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మోహన్‌నాయక్, బాలు, పత్తిలక్ష్మన్, ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు శుభాకాంక్షల వెల్లువ**

బాన్సువాడ ఎమ్మెల్యేగా గెలుపొందిన పోచారం శ్రీనివాసరెడ్డికి పట్టణంలోని వివిధ కుల సంఘాలు, వ్యాపారులు, విద్యా సంస్థల యాజమాన్యాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పట్టణంలోని కిరాణా అసోసియేషన్ సంఘ సభ్యులు ఎమ్మెల్యే పోచారాన్ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

దోమకొండ, డిసెంబర్ 13 : మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ దశమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధులు, సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 13 : ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తపాలా ఉద్యోగులు అన్నారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో బాన్సువాడ తపాలా ఉద్యోగులు పట్టణంలోని తపాలా కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న ప్రయోజనాలను తపాలా ఉద్యోగులకు కూడా వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జీడీఎస్ ఉద్యోగుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారిందని వారు వాపోయారు. కార్యక్రమంలో చంద్ర శేఖర్, సాయిలు, గౌస్, రవీందర్, లక్ష్మి, శ్వేత, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

మాచారెడ్డి, డిసెంబర్ 13 : మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఉదయం 11 గంటలలోగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

## 15న జిల్లా స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ సెలక్షన్స్

కామారెడ్డి, డిసెంబర్ 13 : కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన శుక్రవారం జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు 10 కి.మీ, 8 కి.మీ, 6 కి.మీ, 4 కి.మీ, 2 కి.మీ దూరపు అంశాల్లో మెన్ అండ్ ఉమెన్, అండర్ 20, 18, 16 సంవత్సరాల బాలబాలికలకు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు బర్త్ సర్టిఫికెట్, ఎస్ఎస్‌సీ జిరాక్స్‌తో ఉదయం 8 గంటలకు జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో హాజరకావాలని సూచించారు.

## రోడ్డెక్కిన ఆటో డ్రైవర్లు..

- ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తో వాగ్వివాదం
- ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని డిమాండ్



దోమకొండలో గాంధీ విగ్రహం వద్ద రాస్తారోకో చేస్తున్న ఆటో డ్రైవర్లు

దోమకొండ, డిసెంబర్ 13 : కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని దోమకొండ ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం మొదలుపెట్టిన నాటి నుంచి గిరాకీ లేక ఆదాయం కోల్పోతున్నామని డ్రైవర్లు వాపోయారు. తమ బతుకులు రోడ్డున పడుతున్నాయని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకో చేసే సమయంలో కామారెడ్డి డిపోకు చెందిన బస్సు పక్క నుంచి వెళ్లడానికి ప్రయత్నించగా ఆటో డ్రైవర్లకు బస్సు డ్రైవర్‌కు మధ్య కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు కలుగజేసుకోవడంతో వాగ్వాదం సద్దుమనిగింది. అనంతరం ఆటో డ్రైవర్లు తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆటో యూనియర్ డ్రైవర్లు నిమ్మ బాబు, కుమ్మరి గంగాధర్, నరేశ్, నవీన్ కుమార్, మహేశ్, ఖాసీం, తిరుపతి, బాబు, నారాయణ, ధర్మయ్య, జావీద్, రవి, మహదేవ్, అలీ, పోచ్చయ్య, విజయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**న్యాయం చేయండి..**

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం మొదలుపెట్టిన నాటి నుంచి గిరాకీ లేక ఆదాయం కోల్పోతున్నామని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. దోమకొండలో రాస్తారోకో కార్యక్రమం చేసి విరమిస్తున్న సమయంలో అటుగా వచ్చిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డితో తమకు న్యాయం చేయాలని విన్నవించారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు ఉన్నారు.

## 'ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆస్తుల పరిరక్షణకు ఉద్యమించాలి'



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

కామారెడ్డి, డిసెంబర్ 13 : కామారెడ్డి డిగ్రీ కళాశాల ఆస్తుల పరిరక్షణ కోసం ఉద్యమించాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములు కబ్జా చేయడానికి ప్రైవేట్ వ్యక్తులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. శిశు మందిర్ పాఠశాల యాజమాన్యం తప్పుడు లీజ్ రిజిస్ట్రేషన్ చేయించుకొని అక్రమ నిర్మాణాలకు పాల్పడుతుందన్నారు. పాఠశాల చేపడుతున్న నిర్మాణాలు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. యూకో బ్యాంకులో అరోరా ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 26.15 ఎకరాల భూమి మీద తీసుకున్న రుణం అరోరా కళాశాల యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కర్షక్ బీఈడీ కళాశాలను వెంటనే ప్రభుత్వం స్వాధీనం పరుచుకొని ప్రభుత్వ బీఈడీ కళాశాలగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు ఆజాద్, సందీప్ కుమార్, అరుణ్‌కుమార్, లక్ష్మణ్, విఠల్, బాలు, నాగరాజు, నరేందర్, రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యేల ఇండ్లపై సోదాలు చేయాలి



ఎమ్మెల్యే కాటిపల్లితో కలిసి మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార

కామారెడ్డి, డిసెంబర్ 13 : కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యేల ఇండ్లపై సోదాలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. కామారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు ఇంట్లో 395 కోట్ల రూపాయలు దొరకడం ఆశ్చర్యకరమైన విషయమని అన్నారు. భారతదేశంలో ప్రధాని మోదీ మంచి పరిపాలన అందించాలనే దృఢసంకల్పంతో అవినీతికి దూరంగా నీతి వంతమైన పాలన చేయాలని ముందుకు వెళ్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి ఎంత ఉందో మనందరికీ తెలుసని అన్నారు. మళ్లీ అవినీతి చరిత్రను తిరగరాయాలని కాంగ్రెస్ చూస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యేల ఇండ్లపై సోదాలు చేసి అవినీతి సొమ్మును బయటికి తీయాలని, ఆ సొమ్మును ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. సీబీఐ ఎంక్వైరీ చేయాలన్నారు. రాహుల్ గాంధీ యాత్రలో సాహు ముందుండి నడిపించారని చెప్పారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ధీరజ్ సాహు ఇంట్లో దొరికిన సొమ్ము అవినీతి సొమ్ము అని అన్నారు. ఈ సొమ్మును రానున్న ఎన్నికల్లో ఖర్చు పెట్టి అధికారంలోకి వచ్చేందుకు చూస్తున్నదని తెలిపారు. దీనిపై పూర్తిగా ఎంక్వైరీ వేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా నాయకులు అవినీతికి పాల్పడితే జైలులో ఉంటామని అనుకోవాలని అన్నారు. అనంతరం కామారెడ్డి నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన కాటిపల్లి రమణారెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మారెడ్డి, మురళీధర్‌గౌడ్, పోతంగల్ కిషన్‌రావు, నీలం రాజులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.